క్లుప్తంగా

ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలని తెలంగాణ ప్రజాఫ్రంట్ జిల్లా సమన్వయ కర్త బిచ్చారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దళితులందరు ఐక్యంగా ఏకమై రిజర్వేషన్‌ను సాధించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఓట్ల కోసం వచ్చే రాజకీయ పార్టీలను వర్గీకరణపై నిలదీయాలని కోరారు. వర్గీకరణను అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమవుతున్నాయని, వర్గీకరణపై ఆ ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉంటే వెంటనే అమలు చేయాలని కోరారు.

ఎస్సీ వర్గీకరణ సభను జయప్రదం చేయాలి

జడ్చర్ల: ఎస్సీ వర్గీకరణను వెంటనే చేపట్టాలన్న డిమాండ్‌తో వచ్చే నెల 7న హైదరాబాద్‌లో నిర్వహించనున్న లక్ష డప్పులు, వేయి గొంతుకల భారీ సాంస్కృతిక మహాసభను జయప్రదం చేయాలని జడ్చర్ల ఎమ్మార్పీఎస్ నాయకులు విజ్ఞప్తి చేశారు. బుధవారం స్థానిక అంబేడ్కర్ కళాభవన్ వద్ద వారు సమావేశంలో మాట్లాడారు. మహాసభను విజయవంతం చేసేందుకు కావలసిన కార్యాచరణపై చర్చించారు. కౌన్సిలర్ శశికిరణ్, బీఎస్పీ ఇన్‌చార్జి విజయ్, నాయకులు చంద్రకాంత్, రవికిషోర్, రాజేశ్, శివప్రసాద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల్లో అవకాశం కల్పించాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: రేషన్‌కార్డు, ఇందిరమ్మ గృహ పథకాల్లో ఆర్టీసీ రిటైర్డ్ కార్మికులకు అవకాశం కల్పించాలని అల్‌ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు జహంగీర్‌బాబా సీఎంకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు తమ సొసైటీ తరపున మెయిల్ ద్వారా సీఎం పేషీకి వినతిపత్రం పంపినట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని సొసైటీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర సంక్షేమ పథకాల్లో ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు ప్రాముఖ్యత కల్పించాలన్నారు. కొన్నేళ్లుగా రిటైర్డ్ అయిన ఆర్టీసీ కార్మికులు మిగిలిన బకాయిల కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. పిల్లల చదువు, ఆడపిల్లల పెళ్లిళ్ల కోసం విశ్రాంత కార్మికుల బకాయిలు చెల్లించాలని కోరారు. ఆర్టీసీ కార్మికులకు 2021 పే స్కేల్, 2017 బకాయిలు, డీఏ బకాయిలు వెంటనే చెల్లించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు అందించాలని కోరారు.

విద్యా వ్యవస్థ మరింత పటిష్టం



దేవరకద్ర: రాష్ట్రంలో విద్యావ్యవస్థ మరింత పటిష్టంగా మారిందని పాఠశాల స్థాయి నుంచి మౌలిక సౌకర్యాలు మెరుగు పడ్డాయని టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన దేవరకద్రలో విలేకరులతో మాట్లాడారు. దేవరకద్ర నియోజకవర్గంలో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి కృషితో ఇప్పటికే దేవరకద్రలో డిగ్రీ కళాశాల, చిన్నచింతకుంటలో జూనియర్ కళాశాలలను అధికారం వచ్చిన మూడు నెలల్లోనే ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. చిన్నచింతకుంటలో ఇంటిగ్రేటెడ్ స్కూలు శంకుస్థాపన చేశారని, కేజీబీవీ కళాశాలకు మూడు ఒకేషనల్ కోర్సులు రావడం జరిగిందన్నారు. దేవరకద్ర నియోజకవర్గానికి పాలిటెక్నిక్ కళాశాల కోసం ఎమ్మెల్యేతో ప్రతిపాదనలు చేశామని, జూన్ నాటికి వచ్చే అవకాశం ఉందన్నారు. ఐటీఐని దేవరకద్రలోనే ఏర్పాటు చేస్తారని తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాలుడి అదృశ్యం


గౌతమ్(ఫైల్)

నవాబుపేట: మండలంలోని లోకిరేవు గ్రామానికి చెందిన బాలుడు అదృశ్యమైన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. లోకిరేవుకు చెందిన ఎరుకలి గౌతమ్ లింగంపల్లి జెడ్పీ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. బాలుడు ఈ నెల 20న ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయాడు. బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. బుధవారం బాలుడి తండ్రి రాంచంద్రయ్య ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు.

గుడ్డిమల్కాపూర్‌లో వార్షికోత్సవాలు

హన్వాడ: మండలంలోని గుడ్డిమల్కాపూర్‌లో ధ్వజస్తంభం, పోచమ్మ, బొడ్రాయి విగ్రహాలను నెలకొల్పి ఏడాది కావస్తున్నందున వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామస్తులు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి పోచమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, మాజీ ప్రజాప్రతినిధులు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.


అయోధ్యనగర్‌లో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్ పర్సన్ అనిత


భూత్పూర్ మున్సిపాలిటీ 9వ వార్డులో అర్హుల జాబితాను చదువుతున్న మేనేజర్ శంకర్


గాధిర్యాల గ్రామ సభలో మాట్లాడుతున్న అధికారులు

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

• ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

సాక్షి నెట్‌వర్క్: సంక్షేమ పథకాలకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరుగుతుందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రెండో రోజు స్థానిక 7, 13, 19, 20, 28, 32వ వార్డులలో నిర్వహించిన సభలను పరిశీలించి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో కేవలం 1,500 డబుల్ బెడ్రూం ఇళ్లు మాత్రమే ఇచ్చిందని, తాము అధికారంలోకి వచ్చాక ఏటా 3,500 ఇళ్లు పేదలకు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమాల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్‌అహ్మద్, ముడా చైర్మన్ కె.లక్ష్మణ్‌యాదవ్, కౌన్సిలర్లు కట్టా రవికిషన్‌రెడ్డి, లక్ష్మీదేవి, రావుల అనంతరెడ్డి, ఎస్.పద్మ, సాదతుల్లా, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ పాల్గొన్నారు.

■ జిల్లా కేంద్రంలో రెండోరోజు మరో 12 వార్డులలో సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం 4,068 దరఖాస్తులు అందాయి. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి 1,433 మంది, ఆత్మీయ భరోసాకు 16, కొత్త రేషన్ కార్డులకు 2,613, రైతు భరోసాకు ఆరుగురు దరఖాస్తులు చేసుకున్నారు. మొదటి రోజు 3,471 దరఖాస్తులు వచ్చిన విషయం విదితమే. భూత్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని తాజాగా మరో మూడు వార్డులలో నిర్వహించిన సభలకు ఇందిరమ్మ ఇళ్ల పథకానికి 83, కొత్త రేషన్ కార్డుల కోసం 105 దరఖాస్తులు వచ్చాయి. ఈ కార్యక్రమం ఈనెల 24వ తేదీ వరకు కొనసాగనుంది.

■ మహబూబ్‌నగర్ మండలంలోని ఓబ్లాయిపల్లి, ఓబ్లాయిపల్లి తండాలలో గ్రామసభలలో ఎంపీడీఓ ఎంపీడీఓ కరుణశ్రీ పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతిఒక్కరికీ అందేలా పకడ్బందీగా చర్యలు చేపడుతున్నామన్నారు. ఆయా గ్రామసభలలో 735 మంది దరఖాస్తులు చేసుకోగా, అందులో 598 మంది రేషన్ కార్డులు, 112 మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం, 112 మంది ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కోసం దరఖాస్తులు చేసుకున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.


బండమీదిపల్లి వార్డు సభలో దరఖాస్తులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

■ భూత్పూర్ మున్సిపాలిటీలోని 3వార్డుల్లో గ్రామ సభలో 188 దరఖాస్తులు వచ్చినట్లు మున్సిపల్ మేనేజర్ శంకర్ తెలిపారు. 2వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల కోసం 40, రేషన్ కార్డులు35 వచ్చాయి. 6వ వార్డులో ఇళ్లకోసం 6 దరఖాస్తులు, రేషన్ కార్డుల కోసం 13 వచ్చాయి. 9వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల కోసం 38, రేషన్ కార్డుల కోసం 57 దరఖాస్తులు వచ్చినట్లు మున్సిపల్ మేనేజర్ శంకర్ చెప్పారు.

■ రేషన్‌కార్డుల లబ్ధిదారుల జాబితాలో నవాబుపేట మండలంలోని లింగంపల్లి గ్రామానికి చెందిన భూస్వామి, మాజీ జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి పేరు రావటంతో ఆయన దాన్ని రిటన్ తీసుకోవాలని అధికారులకు సూచించారు.

■ అడ్డాకుల మండలంలోని రాచాల, పొన్నకల్, బలీదుపల్లి, కన్మనూర్, మూసాపేట మండలంలోని మూసాపేట, కొమిరెడ్డిపల్లి, తుంకినీపూర్, పోల్కంపల్లి గ్రామాల్లో గ్రామ సభలను నిర్వహించారు.


కొమిరెడ్డిపల్లిలో గ్రామ సభను నిర్వహిస్తున్న అధికారులు

■ హన్వాడ మండలంలోని అయోధ్యనగర్, హన్వాడ, తదితర గ్రామాల్లో గ్రామసభ కార్యక్రమాలు జరిగాయి. గ్రామసభల ద్వారా రాష్ట్రప్రజలకు మేలు జరుగుతుందని ఏఎంసీ చైర్ పర్సన్ బెక్కరి అనిత పేర్కొన్నారు.

■ మహమ్మదాబాద్ మండలంలో తమ పేరు రాలేందంటూ కొందరు దరఖాస్తులు పెట్టుకున్నా రు. మండలంలోని గాధిర్యాల్, గువ్వనికుంట తండా, ధర్మాపూర్, చిన్నయపల్లి గ్రామాల్లో అధికారులు అర్హులను ఎంపిక చేశారు. దరఖాస్తు చేసుకున్న తమ పేరు రాలేదని కొందరు ఆగ్ర హం వ్యక్తం చేస్తూ మళ్లీ వినతి పత్రాలు సమర్పించారు.

■ గ్రామ సభల్లో వెల్లడించిన వారి జాబితాలో పేర్లు లేని వారు తిరిగి దరఖాస్తులు చేసుకోవాలని తహసీల్దార్ కృష్ణయ్య సూచించారు. దేవరకద్ర మండలంలోని చౌదర్‌పల్లి సభలో ఆయన మాట్లాడారు.

■ దేవరకద్ర మండలంలో గుడిబండ, మీనుగోనిపల్లి, హజిలాపూర్, చౌదర్‌పల్లి, నాగారం, చిన్నరాజమూర్ గ్రామ సభల్లో వివిధ పథకాలకు కొత్తగా 388 దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీఓ శ్రీనివాస రావు తెలిపారు. రేషన్ కార్డులకు 279, ఇందిర మ్మ ఇండ్లకు 81, రైతు భరోసాకు 6, ఆత్మీయ భరోసాకు 22 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.

రైతు భరోసా రాలేదు



రైతు భరోసా జాబితాలో నా పేరు లేదు. నాకు కేవలం 3 ఎకరాల భూమి ఉంది. ఈ విషయంలో అధికారులను అడిగితే మరో సంబంధిత అధికారులు కలవాలని సూచించారు. మా గ్రామంలో భూములు ఎక్కువగా ఉన్నవారు అర్హులంటూ ప్రకటించిన జాబితాలో పేర్లు ఉన్నాయి. ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో కూడా నా పేరు లేదు.

– అనిల్, కేశవరావుపల్లి

అర్హులందరికి సంక్షేమ ఫలాలు

• పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



గండేడ్: కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హులందరికి సంక్షేమ ఫలాలు అందిస్తామని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని పెద్దవార్వాల్‌లో గ్రామ సభల్లో ఆయన మాట్లాడారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో పేర్లు రాలేదని ఆందోళన చెందవద్దని, దరఖాస్తు ప్రక్రియ నిరంతరం ఉంటుందన్నారు. రెండో రోజు మండలంలో 7 గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించారు. రేషన్ కార్డుల కోసం 176, ఇళ్ల కోసం 82, ఆత్మీయ భరోసాకు 53, రైతు భరోసాకు 6 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో ఎంపీడీఓ దేవన్న, పీసీసీ సభ్యుడు నర్సింహారావు, డీసీసీబీ ప్రధాన కార్యదర్శి పుల్లారెడ్డి, ఆసిరెడ్డి, జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు



మా పేర్లు రాలేదు సారు..

జాబితాలో నాపేరు లేదు సార్ అంటూ ఇందిరమ్మ ఇళ్ల కోసం లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేశారు. నవాబ్‌పేట మండలంలోని కారూర్, కేశవరావుపల్లి, పోమాల్ గ్రామసభల్లో ప్రజలు చాలా మంది తమ పేర్లు జాబితా లేవని పేర్కొన్నారు. ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ జయరాంనాయక్‌లు వివరించారు. 14 గ్రామాల గ్రామసభలలో రేషన్‌కార్డులు 317, ఇందిరమ్మ ఇళ్లు 439 మంది దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు వివరించారు.

గూడూరులో ఆందోళన

చిన్నచింతకుంట మండలం ఉంధ్యాల, దమగ్నాపురం, పర్దీపురం, గోప్యానా యక్ తండా, బండ్రపల్లి, గూడూరు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. గూడూర్ గ్రామసభలో ఇళ్లు, రేషన్ కార్డులు, ఆత్మీయ భరోసా లిస్ట్‌లో తమ పేర్లు రాలేదని పలువురు ఆందోళన చేశారు. కూలీ పనులు చేసుకుంటున్నామని, ఎకర భూమి కూడా లేదని, మా పేర్లు ఎందుకు రాలేదని అధికారులను నిలదీశారు. భూమి ఉన్నవారికి లిస్ట్‌లో పేర్లు వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. పేర్లు రానివారికి మళ్లీ దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందని, దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సర్ది చెప్పారు.


గూడూర్‌లో ఆందోళన చేస్తున్న మహిళలు

బలీదుపల్లి గ్రామసభలో..

అడ్డాకుల మండలంలోని బలీదుపల్లి గ్రామసభలో గ్రామస్తులు ఆందోళనకు దిగారు. భూమి లేని ఉపాధి కూలీల పేర్లు జాబితాలో లేవని, రేషన్‌కార్డుల జాబితాలో అర్హుల పేర్లు లేవని, చివర్లో ధాన్యం విక్రయించిన కొందరు రైతులకు బోనస్ డబ్బులు రాలేదని అధికారులను నిలదీశారు. కొంతసేపు గందరగోళం నెలకొంది. తర్వాత అధికారులు, కొందరు నాయకులు ఆందోళన చేసే వారిని అదుపు చేయడంతో వివాదం సద్దుమణిగింది. కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులే అధికారులను నిలదీశారని గ్రామంలో చర్చ సాగడం గమనార్హం.


బలీదుపల్లి గ్రామసభలో ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



రాజాపూర్(బాలానగర్)/జడ్చర్ల టౌన్: ఎన్నికల సమయంలోనే పార్టీలు తర్వాత పార్టీలు పక్కన పెట్టి నియోజకవర్గ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి పేర్కొన్నారు. బాలానగర్ మండలంలోని చింతకుంటతండా, రాజాపూర్ మండలం కుత్నేపల్లి గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో ఆయన మాట్లాడారు. గ్రామసభల్లో ఈ సంక్షేమ పథకాల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందన్నారు. లిస్టులో పేరు రానివారు ఎలాంటి ఆందోళన చెందవద్దని, దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డి, నాయకులు లక్ష్మణ్‌నాయక్, భాస్కర్‌నాయక్, వెంకట్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, శంకర్ పాల్గొన్నారు.

చదివే బాధ్యత మీదే..

ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా మౌలిక సదుపాయాలు కల్పించే బాధ్యత తమదని, దానిని సద్వినియోగం చేసుకుని చదవాల్సిన బాధ్యత మీదేనని పదో తరగతి విద్యార్థులకు ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి అన్నారు. జడ్చర్ల పట్టణంలోని ప్రేమ్‌రంగా గార్డెన్‌లో మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పదో తరగతి విద్యార్థుల ప్రేరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఎవరికైనా కెరీర్‌పట్ల అవగాహన కలగాలంటే తల్లిదండ్రులను తీసుకుని క్యాంప్ ఆఫీస్‌కు రావాలని, అక్కడ అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తామన్నారు. 8, 9, 10వతరగతి విద్యార్థులకు డిజిటల్ క్యూర్ కోడ్‌తో కూడిన బుక్‌లు అందజేస్తున్నామని, దాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అంతకుముందు డీఈఓ ప్రవీణ్‌కుమార్ పదో తరగతి విద్యార్థులకు పలు సూచనలు ఇచ్చారు. వక్త హన్మంత్‌రెడ్డి విద్యార్థులకు వ్యక్తిత్వవికాసం, ఆత్మవిశ్వాసం, పరీక్షలంటే భయం పోయేలా పలు మార్గదర్శకాలు చేశారు. గురుకులాలు, సైనిక్ స్కూల్‌లో ప్రవేశాలకు సంబంధించిన నోటిఫికేషన్ల వివరాల పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండలంలోని 13 జిల్లా పరిషత్, గురుకులాల విద్యార్థులు, ఎంఈఓ మంజులాదేవి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.


ముడా నిధులు దుర్వినియోగం

జడ్చర్ల: ముడా (మహబూబ్‌నగర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) నిధులను గత పాలకులు దుర్వినియోగం చేశారని ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి ఆరోపించారు. హౌసింగ్‌బోర్డు కాలనీలో గ్రామసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ముడాకు జడ్చర్ల నియోజకవర్గం నుంచి రూ.30కోట్లు సమకూరితే ఆయా నిధులను జడ్చర్ల నియోజకవర్గం అభివృద్ధికి కేటాయించాల్సి ఉండగా, నయాపైసా తీసుకురాలేదన్నారు. నిధులన్నీ మహబూబ్‌నగర్‌కే మళ్లించారని, దీంతో జడ్చర్ల అభివృద్ధి కుంటు పడిందన్నారు. ఏడాది ముడాకు రూ.29 కోట్లు సమకూరితే తన పట్టుదలతో ఇప్పటికే రూ.6.50 కోట్లు నియోజకవర్గానికి తీసుకువచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత,కమిషనర్ లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

గుర్తులు వచ్చేశాయ్..

పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు

• సర్పంచ్‌లకు 30.. వార్డుసభ్యులకు 20
• బ్యాలెట్ పేపర్ల ముద్రణ కసరత్తు షురూ
• ఇప్పటికే సిద్ధంగా ఉన్న బాక్స్‌లు



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ఇప్పటికే ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల గుర్తింపు చేపట్టిన యంత్రాంగం తాజాగా అభ్యర్థులకు కేటాయించనున్న గుర్తులను ఖరారు చేసింది. సర్పంచ్ అభ్యర్థులకు 30, వార్డు సభ్యులకు 20 గుర్తులు కేటాయిస్తూ ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వం ఎప్పుడు నోటిఫికేషన్ విడుదల చేసినా విజయవంతంగా నిర్వహించేందుకు వీలుగా కసరత్తు ముమ్మరం చేసింది. వాటికి అనుగుణంగా జిల్లాస్థాయిలో బ్యాలెట్ పేపర్ల ముద్రణకు అధికారులు చర్యలు చేపట్టారు. బ్యాలెట్ బాక్స్‌లు కూడా సిద్ధంగా ఉంచారు. సర్పంచ్, వార్డుసభ్యుల ఎన్నికలు పార్టీ రహితంగా నిర్వహిస్తారు. ఈనేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల ప్రజలకు తెలిసిన గుర్తులను కేటాయించారు. సర్పంచ్ బ్యాలెట్ పత్రం గులాబీ రంగులో ఉండగా, వార్డు సభ్యులది తెలుపు రంగులో ఉండేలా ఈగుర్తులను ముద్రించనున్నారు.

సర్పంచ్ బ్యాలెట్ గుర్తులు: బ్యాట్, బ్యాట్స్‌మెన్, స్టంప్స్, ఉంగరం, కత్తెర, ఫుట్ బాల్, లేడీ పర్స్, టీవీ రిమోట్, టూత్‌పేస్ట్, పాన్, చెత్తడబ్బా, బ్లాక్‌బోర్డు, బెండకాయ, కొబ్బరి తోట, డైమండ్, బకెట్, డోర్ హ్యాండిల్, చాయ్ జాలీ, చేతికర్ర, మంచం, పలక, టేబుల్, బ్యాటరీ, లైట్, బ్రష్, పడవ, బిస్కెట్, వేణువు, చైన్, చెప్పులు, గాలిబుడగ వంటి గుర్తులు ఉంటాయి.

వార్డు సభ్యుల బ్యాలెట్‌లో ఇలా..: గౌను, గ్యాస్ స్టౌ, స్టూల్, సిలిండర్, బీరువా, ఈల, కుండ, డిష్ యాంటినా, గరాట, మూకుడు. ఐస్‌క్రీం, గాజు గ్లాస్, పోస్టు డబ్బా, కవర్, హాకీ కర్ర, బంతి, నెట్, కటింగ్ ప్లేయర్, బాక్స్, విద్యుత్ స్తంభం, కేటిలి గుర్తులు ఉంటాయి.



ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నాం



పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నాం. జిల్లాలో పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించేలా ఏర్పాట్లుచేస్తున్నాం. ఈసీ ఎప్పుడు నోటఫికేషన్ జారీచేసినా విజయవంతంగా నిర్ హించేలా పూర్తి స్థాయిలో సంసిద్ధంగా ఉన్నాం. ఇప్పటికే ఓటరు జాబితాను ప్రకటించాం.

–పార్థసారథి, డీపీఓ, మహబూబ్‌నగర్

నోటా కూడా

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎవరు నచ్చకుంటే వారిని తిరస్కరించే అవకాశాన్ని ఓటర్లకు ఈసీ కల్పించింది. బరిలో నిలిచిన అభ్యర్థులతో పాటు నోటా గుర్తును బ్యాలెట్ పేపర్‌పై ముద్రించనున్నారు. పోటీలో ఇద్ద రు అభ్యర్థులు ఉంటే వారితో పాటు మూడో గుర్తుగా నోటాను ముద్రించనున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

నవాబుపేట: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ విక్రమ్ సూచించారు. బుధవారం మండలంలోని పోమాల్, కారూర్, తీగలపల్లి గ్రామాల్లో సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలనే విషయంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫోన్‌లో అనుమానాస్పదంగా ఎవరైనా తమ బంధువులు ఆపదలో ఉన్నారని చెప్పటం, లేదా క్రైంలో ఇరుకున్నట్లు చెప్పటం చేసి డబ్బులు రాబట్టుకుంటారని, వాటి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎలాంటి సమాచా రం లేకుండా డబ్బులు వేయరాదని ఆయన సూ చించారు. వెంటనే ప్రజలు పోలీసులకు సమాచా రం అందించాలని, 1930కు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ లింగం, రమేష్‌గౌడ్, శ్రీహరి, కృష్ణ, పోలీసు సిబ్బంది రాఘవేందర్‌రెడ్డి, గులామ్, వెంకటేష్ ఉన్నారు.


పోమాల్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్‌ఐ

హన్వాడలో అవగాహన..

హన్వాడ: ప్రజలు సైబర్‌నేరాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని ఎస్‌ఐ వెంకటేష్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్‌లలో ఇటీవల కొందరు అపరిచిత వ్యక్తులు మోసాలకు పాల్పడుతున్నారన్నారు. వారి బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు.

రాష్ట్రస్థాయి ఎంపీకప్ కరాటే బ్రోచర్ ఆవిష్కరణ

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో వచ్చేనెల 2న ఆర్‌కే స్పోర్ట్స్ కరాటే డూ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ఎంపీకప్–2025 కరాటే ఓపెన్ చాంపియన్‌షిప్ బ్రోచర్లు, ట్రోఫీలను బుధవారం జిల్లా కేంద్రంలో ఎంపీ డీకే అరుణ ఆవిష్కరించారు. పోటీలను విజయవంతంగా నిర్వహించాలని కోరారు. ఆర్‌కే స్పోర్ట్స్ కరాటే డూ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ మాస్టర్ కె.రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి ఓపెన్ కరాటే పోటీలు ఉంటాయని, ఈ పోటీల్లో ఉమ్మడి జిల్లాతో పాటు ఇతర జిల్లాల నుంచి దాదాపు 500 మంది కరాటే విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. కటా, కుమితే, టీమ్ కటా, వెపన్ అంశాల్లో పోటీలు ఉంటాయని తెలిపారు. ప్రతిభ చాటిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ ట్రోఫీలు అందజేస్తామన్నారు. అకాడమీ సలహాదారులు ఎంఎన్.విజయ్‌కుమార్, నాయకులు పద్మజారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాములు, చెన్నవీరయ్య, ఇన్‌స్ట్రక్టర్లు పాల్గొన్నారు.


బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీ డీకే అరుణ

ఇసుక టిప్పర్ పట్టివేత

జడ్చర్ల: జడ్చర్ల–కల్వకుర్తి ప్రధాన రహదారిపై మంగళవారం రాత్రి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు. అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.